ప్రచార వ్యూహాలపై పదును

- నేడు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం
- విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం
- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్

సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 2: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏప్రిల్ 3 నుంచి సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నామని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి.పద్మారావు, మాజీ మంత్రి తలసాని, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్‌తో పాటు ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కె.విప్లవ్‌కుమార్, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేశ్, మన్నె కవితారెడ్డిలతో జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ.. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్యనాయకులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేద్దామని సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం సమన్వయ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలతో చర్చించి ప్రచార వ్యూహాలను ఖరారు చేయనున్నామని పేర్కొన్నారు. బూత్‌స్థాయిలో కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయాలని సూచించారు.

ముదిరాజ్‌లు సంఘటితం కావాలి

అందె బాబయ్యకు నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ చొప్పరి శంకర్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 2: ముదిరాజ్ కులస్తులు సంఘటితమై హక్కులు, రాజ్యాధికార సాధన కోసం ముందడుగు వేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్‌ముదిరాజ్ పిలుపు నిచ్చారు. మంగళవారం నారాయణగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అందె బాబయ్యముదిరాజ్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. శంకర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులు మరింత చైతన్యవంతులై హక్కులను కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వీరి సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

బంజారాహిల్స్, ఏప్రిల్ 2: స్నేహితుడిని హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటరమణకాలనీకి చెందిన జె.మునిరాజ్ కొంత కాలంగా కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి పుత్‌పాత్ మీద జీవిస్తున్నాడు. సినిమా సెట్టింగ్ కార్మికుడిగా పనిచేసే వాడు. శనివారం మద్యం సేవించిన మునిరాజు అన్నపూర్ణ స్టూడియో సమీపంలో పుట్‌పాత్‌పై నిద్రించాడు. అక్కడే పనిచేస్తున్న ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం వినోద్ (30) అతడితో పాటు పుట్‌పాత్‌లపై నివసిస్తున్నాడు. తాను రోజు పడుకునే స్థలంలో మునిరాజ్ ఉండడంతో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో వినోద్ ఓ సిమెంట్ రాయితో మునిరాజ్ తలపై గట్టిగా కొట్టా డు. దీంతో అతడు చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వినోద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న

హిమాయత్‌నగర్‌లో వైజంక్షన్‌లో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 2: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి అన్నారు. పాపన్నగౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్ వైజంక్షన్‌లో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాన్య గీత కార్మిక కుటుంబంలో పుట్టి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధుడు పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, గౌడ హాస్టల్ అధ్యక్షుడు చక్రవర్తి గౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, బీసీ నాయకులు కిషన్‌గౌడ్, రాంమోహన్‌గౌడ్, పడాల శ్రీనివాస్, ప్రభాకర్, కిరణ్, కోల జనార్దన్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు చేయాలి

బుర్రా వెంకటేశంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 2: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ బకాయి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం పేర్కొన్నది. మంగళవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ రూ.5600 కోట్లపైగా బకాయి విడుదల చేయకపోవడంతో డిగ్రీ, పీజీతోపాటు వివిధ కోర్సులను చదివిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలు కాలేజీల యాజమానులు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ, రెహమాన్, సిద్ధు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 2: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అయినప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మంగళవారం స్పెషల్ క్యాంప్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వీరేంద్ర ఆధ్వర్యంలో కందుకూరులో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. చెత్తచెదారాల తొలగింపు, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. గ్రామ యువత కోసం కంప్యూటర్, ఆంగ్ల ప్రావీణ్యం కోసం అధ్యాపకులను పంపుతామన్నారు. కందుకూరు పంచాయతీ కార్యదర్శి రాణప్రతాప్‌రెడ్డి, హెచ్ఎం, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే విద్యార్థికి గుర్తింపు

అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ జడేజా

ఖైరతాబాద్, ఏప్రిల్ 2: నైపుణ్యంతో కూడిన విద్యతోనే విద్యార్థికి సరైన గుర్తింపు లభిస్తుందని గుజరాత్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్బీ జడేజా అన్నారు. సోమాజిగూడలో గుజరాత్‌కు చెందిన మార్వాడీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు విద్యలో సరైన నైపుణ్య విలువలు లేకపోవడంతో ఏ రంగంలో రాణించలేకపోతున్నారన్నారు. వర్సిటీ సీఎఫ్‌వో హార్దిక్ మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థులకు విద్యాపరమైన సహకారం ఇచ్చేందుకు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఖైరతాబాద్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భరోసా కల్పించేందుకు ఖైరతాబాద్, సైఫాబాద్ పోలీసులు మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఏసీపీ సంజయ్ కుమార్ నేతృత్వంలో ఖైరతాబాద్, సైఫాబాద్ సీఐలు ఎస్.రాజశేఖర్, పి.రాఘవేందర్, డీఐ వై.రామలింగారెడ్డి, సీఐఎస్ఎఫ్, సివిల్ పోలీసుల బృందంతో బడా గణేశ్, సీఐబీ క్వార్టర్స్, మార్వాడి గల్లీ, కూరగాయలమార్కెట్, ఇందిరానగర్, శ్రీనివాస్‌నగర్, మారుతినగర్, బీజేఆర్‌నగర్, రైల్వేగేట్, చింతలబస్తీ, ఏసీ గార్డ్స్, ఆయోధ్య సర్కిల్ మీదుగా ఫ్లాగ్‌మార్చ్ సాగింది.

దర్యాప్తులో నిర్లక్ష్యం.. ఇన్‌స్పెక్టర్, ఎస్సై సస్పెన్షన్

సిటీబ్యూరో: కేసుల దర్యాప్తుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన లాలాగూడ ఇన్‌స్పెక్టర్ పద్మ, అంబర్‌పేట ఎస్సై అశోక్‌ను సస్పెండ్ చేస్తూ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్డు ప్రమాదం కేసులో సరిగా విచారణ నిర్వహించక, ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించినట్లు సీపీ విచారణలో తేలడంతో లాలాగూడ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అదే విధంగా చైన్ స్నాచింగ్ కేసులో బాధితులకు న్యాయం చేయకుండా వేధించిన ఎస్సై అశోక్‌ను సైతం సస్పెండ్ చేశారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రేవతి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 2: ఎండలతో అప్రమత్తంగా ఉండాలని అమీర్‌పేట్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్(ఎస్‌పీహెచ్‌ఓ) డాక్టర్ రేవతి అన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానను సందర్శించి వైద్య సేవలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. తీవ్రమైన ఎండలతో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచించారు. ప్రధానంగా చిన్నపిల్లలు, మహిళలు, గర్భిణులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో 20 నిమిషాలకు ఒకసారి మంచినీళ్లు తాగాలని, అత్యవసర సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానల్లో ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్మయి శ్రీరంగ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లీబర్డ్ ఆఫర్‌తో పన్ను వసూళ్లు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 2: ఆస్తిపన్ను వసూళ్లలో ఆదినుంచి వేగం పెంచేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సమాయత్తమవుతున్నారు. గత ఆర్థిక (2023-24) సంవత్సరం యూసుఫ్‌గూడ 19వ సర్కిల్‌లో వందశాతం దాటింది. దీంతో వసూళ్లలో అధికారులు అదే ఉత్సాహంతో ఉన్నారు. ఈ ఏడాది ప్రాపర్టీ ట్యాక్స్‌ను ఏప్రిల్‌లో ముందుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఎల్లీబర్డ్ పథకంపై జీహెచ్ఎంసీ అధికారులు విస్తృత ప్రచారం చేపడుతూ పన్ను వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 1 నుంచి 30 వరకు పన్ను చెల్లించిన వారికి ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. ఆస్తిపన్ను ముందుగా చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూసూఫ్‌గూడ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ కోరారు.

నకిలీ పోలీసు అరెస్టు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2: పోలీసునని ద్విచక్ర వాహన మెకానిక్‌ల నుంచి డబ్బులు వసూల్ చేస్తున్న నిందితుడిని ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బాలరాజు వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నాగసాల గ్రామానికి చెందిన బోయ రాజ్‌కుమార్ డ్రైవర్. కొంతకాలం నుంచి ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఆన్‌లైన్‌లో ప్రధాన పట్టణాల్లో ద్విచక్ర వాహనదారుల మెకానిక్ షాపులను ఎంచుకొని వారి వద్ద తన ద్విచక్ర వాహనం మీ షాపులో మరమతులు చేయించాను. అది ప్రస్తుతం సక్రమంగా నడవడంలేదు. నాకు డబ్బులు ఇవ్వాలని నేను పోలీసునని భయపెడుతూ డబ్బులు వసూలుకు పాల్పడుతున్నాడు. మహబూబ్‌నగర్‌తో పాటు ఇతర పట్టణాల్లో ద్విచక్ర వాహన మెకానిక్‌లను భయపెడుతున్నారు. ఇటీవల శంషాబాద్ పట్టణంలోని శివచంద్ర బైకు పాయింట్ మెకానిక్ యాజమానికి ఫోన్ చేసి నేను నీ వద్ద నా బైక్ మరమతులు చేయించాను. ఇప్పుడు బండి నడవడంలేదు. నాకు రూ.50లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడు ఇవ్వడానికి నిరకరిస్తే నేను పోలీసునని కేసులు పెడుతానని భయపెట్టడంతో సదరు వ్యక్తి రూ.2వేలు ఆన్‌లైన్‌లో వేశాడు. మరోసారి డబ్బులు ఇవ్వాలని ఫోన్ చేయడంతో సదరు వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నకిలీ పోలీస్, అతడి ద్విచక్ర వాహనం టీఎస్ 06 టీఆర్ 4083 నంబర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో జడ్చర్లలో 2023లో కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తెంగాణ రాష్ట్ర టీపీసీసీ కల్లు గీత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా టి.రేవతిగౌడ్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగరాజుగౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. మణికొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తిదారుల అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తానన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కల్లుగీత విభాగం ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నందుకు నాగరాజుగౌడ్‌తో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. – మణికొండ, ఏప్రిల్ 2

ఎన్నికల బాండ్ల వ్యవహారంలో మోదీపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 2: ఎన్నికల బాండ్ల వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన ప్రధానమంత్రి మోదీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం పని చేయాల్సిన పాలకులు అవినీతి అక్రమాలకు పాల్పడటం సిగ్గుచేటని అన్నారు. అవినీతిని అంతం చేస్తామని చెప్పిన మోదీ బినామీ కంపెనీలతో ఎన్నికల బాండ్లను ఎందుకు అనుమతించారో ప్రజలకు చెప్పాలన్నారు. ఎన్నికల బాండ్ల సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇన్‌కాయిస్‌లో స్వచ్ఛ భారత్

దుండిగల్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, ప్రగతినగర్ సమీపంలోని ఇన్‌కాయిస్(భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం)లో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌కాయిస్‌కు చెందిన శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పరిసరాలను శుభ్రం చేశారు.

పనులు చేయనందున.. పన్నులు చెల్లించం

- పన్నులు చెల్లించని కాలనీ వాసులు
- అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యాన్ని చేరుకోని పన్ను వసూలు
- చెల్లింపు కుదరదని తేల్చిచెప్పిన పలు కాలనీ అసోసియేషన్ల సభ్యులు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ, ఏప్రిల్ 2: తమ కాలనీలో పనులు చేపట్టలేదు, తాము ఆస్తి పన్ను చెల్లించడం కుదరాదని పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు తెల్చిచెప్పారు. దీంతో అధికారులు ఏమీ చేయలేక ఆస్తి పన్ను వసులులో వెనకబడటానికి కారణమని తెలిసింది. నగర శివారు ప్రాంతంలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గాను కార్పొరేషన్ పరిధిలో మొత్తం 33వేల 328 మంది ఆస్తిపన్ను చెల్లింపుదారుల నుంచి పన్నును వసులు చేయాలి. కాగా రూ.28 కోట్ల డిమాండ్‌ను చేరుకునేందుకు కార్పొరేషన్ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఆస్తి పన్నుదారులకు అవగాహన కల్పించడంతో పాటు బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బందిని ఆస్తి పన్ను వసులు కోసం వాడుకున్నారు. ఇంత చేసిన రూ.21కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసి 74శాతంని సాధించారు. దీకిని గల కారణం పలు కాలనీలవాసులు ఆస్తి పన్ను చేల్లించక పోవడమే కారణం అయి ఉండవచ్చని అధికారులు, సిబ్బంది గుసుక్కుంటున్నారు.

పనులు జరుగలేదు.. అందుకనే..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీలలో అభివృద్ధి పనులు (రోడ్లు, డ్రైనేజీ లేన్ల నిర్మాణం, మంచినీటి వసతి) జరుగలేదని, అందుకే తాము ఆస్తి పన్ను చెల్లిచలేదని బిల్‌కలెక్టర్లకు ఆయా కాలనీ వాసులు బాహాటంగానే తెలిపారు. దీంతో చేసేది లేక బిల్ కలెక్టర్లు, అధికారులు వెనుదిరిగారు.

పన్ను చెల్లింపు అవశ్యకతను వివరించడంలో అధికారుల విఫలం..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాలనీలవాసులు అభివృద్ధి పనులు జరుగలేదని ఆరోపించారు. దీంతో పన్ను చెల్లించ లేదన్నారు. అయితే పన్ను చెల్లింపు కోసం అధికారులు ప్రజలను చైతన్యం చేయడంలో విఫలమయ్యారని పలువురు పేర్కొన్నారు. దీంతో 2023-2024 ఆర్థిక ఏడాదికి పన్ను వసూలు శాతం తగిందని కార్యాలయంలోనే చర్చించుకోవడం గమనార్హం.

మహిళలు మరింత అభివృద్ధి చెందాలి

చిత్రపురి మహిళా శక్తి గ్రూప్ లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

మణికొండ, ఏప్రిల్ 2: మహిళలు ఉచిత శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని మెలకువలు నేర్చుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి సీతక్క అన్నారు. చిత్రపురి మహిళా శక్తి గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో చేపడుతున్న శిక్షణ శిబిరం లోగో మంగళవారం ప్రగతిభవన్‌లో మంత్రి ఆవిష్కరించారు. ఉగాది నుంచి నిర్వహించే ఉచిత కుట్టుమిషిన్ ట్రైనిం గ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని మంత్రిని ఆహ్వానిం చా రు. కార్యక్రమంలో కస్తూరి విజయ, సునైనా, సరోజిని, పద్మ, స్వప్న, లక్ష్మి, రాజేశ్వరి, చిత్రపురి ఎల్ఐజీ/ఈడబ్ల్యుఎస్ ఓనర్స్ కమిటీ శ్రీనివా స్, ధనరాజ్, తిరుపతి పాల్గొన్నారు.

పరిపూర్ణానంద స్వామికి మద్దతు

సమావేశంలో మాట్లాడుతున్న శివ రాజయోగి కృష్ణ స్వామి

ఖైరతాబాద్, ఏప్రిల్ 2: ఏపీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో హిందూపురం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న అధ్యాత్మికవేత్త పరిపూర్ణానంద స్వామికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని శ్రీ రాజశ్యాల పీఠాధిపతి శివ రాజయోగి కృష్ణ స్వామి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగానే ఏ పార్టీ కూడా ఆయనకు టికెట్ ఇవ్వలేదన్నారు. సొంత లాభం కోసం రాజకీయాల్లో చేరుతున్నారని, అలాంటి తరుణంలో ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజాసేవకు పరిమితమయ్యే పరిపూర్ణానంద లాంటి వారిని ఎన్నుకోవడం అనివార్యమన్నారు. ఈ ఎన్నికల్లో పరిపూర్ణానంద స్వామి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో మదన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్ రావు, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటిజాన్ని తొలి దశలోనే గుర్తించాలి

అన్నదానంలో డాక్టర్ ఆనంద్

సైదాబాద్, ఏప్రిల్ 2: ఆటిజాన్ని తొలిదేశలోనే గుర్తించి తగిన వైద్య సహాయం తీసుకోవాలని డాక్టర్ ఆనంద్ అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని ఫిన్ బధిరుల ఆశ్రమ సంస్థలో ప్రపంచ ఆటిజం నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారా మహిళ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజం నిరావరణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యవంతం చేయటానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆశ్రమంలోని బధిరులు, దివ్యాంగ విద్యార్థులందరికీ పూర్ణిమ, సుజాత సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఫిన్ ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 2: లిబర్టీలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల విధుల్లో ఉన్న కార్మికుడు పెండ్యాల కిషన్ (48) మృతి చెందడం పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అర్బన్ మలేరియా పథకంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తు న్న కిషన్‌కు మంగళవారం మూర్ఛతో కింద పడిపోగా తోటి ఉద్యోగులు దవాఖానకు తరలించారు. చికిత్స పొందు తూ మృత్తి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధా న కార్యదర్శి ఎం.నరసింహ, నాయకులు పి.వెంకటయ్య, కల్యాణ్, అశోక్, ఉపేందర్, ఎల్.రాజు, బాలకృష్ణ, నర్సింగ్‌రావు దవాఖానకు చేరుకుని కిషన్ మృతదేహం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిషన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని నరసింహ డిమాండ్ చేశారు.

మహిళ ఆత్మహత్య

బండ్లగూడ, ఏప్రిల్ 2: తన ఆరోగ్యం బాగాలేదని త్వరగా ఇంటికి రావాలని భర్త పోన్ చేసిన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శివరాంపల్లిలో ఉండే రంగీలాకుమారి(20) పను ల నిమిత్తం బయటకు వెళ్లిన తన భర్త కు సాయంత్రం 4గంటలకు ఫోన్‌చేసి తన ఆరోగ్యం బాగాలేదని త్వరగా ఇం టికి రావాలని చెప్పింది. భర్త తమ బంధువులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో వారు ఇంటికివెళ్లి చూడ గా రంగీల బాత్రుంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్త ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు జైలు శిక్ష

ఖైరతాబాద్, ఏప్రిల్ 2: రద్దీ ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు జైలుశిక్ష పడింది. పోలీసులు వివరాల ప్రకారం.. పంజాగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో ఎండీ షానవాజ్ (22), బి.వినయ్‌కుమార్ (29) మెట్రోస్టేషన్లు, ప్రధాన కూడళ్ల వద్ద వాహనాదారులు, పాదచారులను డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టగా, మంగళవారం నాంపల్లి పదో స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మురళి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.